# విహంగం

'సృష్టిలో తీయనిది స్నేహమేనోయీ'అంటాడు ఒక కవి. అలా అయితే 'సృష్టిలో నిజమైన త్యాగం ప్రేమ' అంటాడు మావాడు ప్రభాకర్. వాడొక పిచ్చివాడు. ప్రేమ పిచ్చివాడు. ఏనాడో తాను ప్రేమించిన అమ్మాయి ఇంకొకడ్ని చేసుకొందని అప్పటి నుండి బ్రహ్మచారిగా జీవితాన్ని గడుపుతున్నాడు. అదీకాక త్రాగుడొకటి. నిరంతరం త్రాగుతుంటాడు అతని భుజానికి తగిలించుకొన్న సంచిలో కూడా బ్రాంది బాటి ల్సుంటాయి.

నేను ఆ అర్థరాత్రి ఉలిక్కిపడి లేచాను. చెడ్డకల. ప్రక్కన సుధ మైమరచి నిద్రపోతూ నిద్రలో నవ్వూకుంటూ ఉంది. లేచి కూజాలోని నీళ్లు గ్లాసులోకి వంచుకొని తాగాను. నా మిత్రుడు ప్రభాకర్ చనిపోయినట్లు చెడ్డకల వచ్చింది. నామనసు వికలమైపోయింది. గది తలుపులు తెరచుకుని పక్కగదిలో ఉన్న నా మిత్రుడు ప్రభాకర్ గదివైపు నడిచాను.

గది తలుపులు బార్లా తెరుచుకొని వున్నాయి. మనిషిలేదు. ఇల్లంతా వెదికి చూశాను. ఎక్కడా కనిపించలేదు. వీడో భగ్న ప్రేమికుడు. వీడ్ని రక్షించి కాపాడటం అనేది గత నెల రోజుల్నుంచి నాకో విచిత్రమైన బాధ్యతగా ఏర్పడింది.

లోపలికి వెళ్లి సుధను లేవగొట్టి విషయం చెప్పాను. కంగారు పడింది. జాగ్రత్తగా ఇంట్లో ఉండమని, వాడికేమీ భయంలేదని చెప్పి నేను రోడ్డు మీదకి వచ్చాను వెతకడానికి.

ఎలాగైతేనేం ఓ అరగంట శ్రమపడ్డ తరువాత దగ్గరలో ఉన్న పార్కులో కనిపించాడు. ఒక బెంచీమీద పడుకొని గాఢనిద్ర పోతున్నాడు ప్రభాకర్. మేమింత ఆరాటపడుతుంటే వాడు ప్రశాంతంగా బెంచీమీద పడుకొని నిద్రపోతున్నాడు. నాకు విపరీతమైన కోపమొచ్చింది. ఫోమ్‌బెడ్, ఫ్యాన్‌గాలి, శుభ్రమైన గది వదిలి ఇక్కడకొచ్చి పడుకోవడం వీడికేం సుఖమో నాకర్థం కావడంలేదు. తట్టిలేపాను.

బద్ధకంగా లేచి కూర్చున్నాడు.

"ఒరే ప్రభాకర్ అర్థరాత్రి గది తలుపులు బార్లా తెరచి వెళ్లిపోతే ఏమైపోయావోనని భయపడిపోయాం" అన్నాను.

"సారీరా. ఇక్కడకు నా సామ్రాజ్యం పిలుస్తున్నట్లనిపిస్తే వచ్చేశాను. మిమ్మల్ని బాధిస్తే నన్ను క్షమించండి" అంటూ లేచి నిలబడ్డాడు.

తాగిన నిషా ఇంకా తగ్గకపోవడంతో మనిషి తూలుతున్నాడు. చెయ్యి పట్టుకున్నాను. ఇద్దరం నడచి వస్తున్నాం.

అడుగులు తడబడుతున్నాయి వాడికి.

"ఒరేయ్ రోజురోజుకి ఉమర్ ఖయ్యామ్‌వి అయిపోతున్నావ్‌రా నువ్వు" అన్నాను.

చెప్పలేని భయం ఆవరించింది. వాడు మాట్లాడడం మొదలు పెట్టాడు.

"ఒరేయ్ నన్ను ఖయ్యాంతో పోల్చడం అన్యాయంరా, ఆనాడు పర్షియాలోని ప్రముఖ గణిత శాస్త్రవేత్తఉమర్ ఖయ్యాం. నలభైయేళ్లు వచ్చే వరకు శాస్త్ర పరిశోధనలో మునిగి తరువాత ఈ ప్రపంచంలో పడ్డాడు. అప్పుడు ఆయనంటాడు "సాకీ. నేను ఈ నలభైయేళ్లు అనవసరంగా కాలాన్ని వ్యర్థం చేసుకొన్నాను. ఇక నుంచి ప్రతిక్షణం మధుపాత్రను నా పెదవులకందించు, దాంతోపాటు నీ అధరాల్ని కూడా నా అధరాలతో కలుపు. ఈ ఆనందం శాశ్వతం. ఈ జీవిత సత్యాన్నే నేను ప్రచారం చేస్తాను" అంటాడు.

"ప్రస్తుతం నీ సిద్ధాంతంకూడా ఇదేకదూ..."

"లేదురా, ఆనాడు పర్షియాలో ప్రతివీధిలోనూ పానశాలలుండేవి. ఎవడి శక్తి కొలది వాడు ఆడ బానిసల్ని కొనేవాడు. మధువు, మగువ ఆనాటి సొసైటీలో సాధారణమైన విషయం. ఉమర్ ఖయ్యాం సిద్ధాంతాన్ని కొంతమంది ప్రజలు వ్యతిరేకిస్తున్నా చక్రవర్తి షెహన్‌షా తోపాటు మహారాణి జులేఖా కూడా అతని శిష్యరికంలో చేరింది. అతని సిద్ధాంతాల్ని నమ్మారు కూడా. ప్రతి వీధిలోనూ అతని గీతాలు పాడి ప్రజలు ఆనందించారు" ఊపిరి పీల్చుకున్నాడు ప్రభాకర్.

"... కానీ నాకూ ఉమర్ ఖయ్యాంకూ ఎక్కడా పోలికలేదురా. పవిత్రమైన నా సామ్రాజ్యం నాకు దక్కకుండా పోయిందనే బాధ తట్టుకోలేక మాత్రమే తాగుతున్నాను. అంటే గత స్మృతుల్ని మరచిపోవడానికి మాత్రమే తాగుతున్నాను అన్నమాట. అంతే... అంతే..."

అప్పటికే ఇంటి వరండాలో కొచ్చాము. ఇంటి వరండాలో దభీమంటూ పడిపోయాడు ప్రభాకర్. మాకోసమే ఎదురుచూస్తున్న సుధ కంగారుగా పరుగెత్తుకు వచ్చి లైటు వెలుగులోపడున్న ప్రభాకర్ వైపు ఆదుర్దాగా చూసి "అన్నయ్యా" అంటూ అరిచింది. అతను స్పృహలో లేడు.

నేను చేతులు, తల పట్టుకున్నాను. సుధ ప్రభాకర్ కాళ్లు పట్టుకొంది. ఇద్దరం అతన్ని పట్టుకొని బెడ్‌మీదికి చేర్చాం.

"సుధా వాడు నా ఫ్రెండ్ అవడంవల్ల నీకు కొత్తగా కష్టాలు ఏర్పడ్డాయి."

"లేదండీ. ప్రభాకర్ అన్నయ్యకు సేవ చేయడంలో నా అన్నయ్యకు సేవ చేసినట్టుగా ఉంది. కాలం కలసిరాక ఇలా అయిపోయాడు గాని అదే సామ్రాజ్యం చేసుకొనుంటే ఈనాడు ఇలా నలుగురి నోళ్లలో నానేవాడా" అంది. ప్రభాకర్ అంటే అదోరకమైన జాలి.

నాకు కావలసింది కూడా అదే, నా స్నేహితుడు కనుక నేను సేవ చేయడంలో కొంత ధర్మముంది. అదే విధంగా సుధ చేయాలనేమీ లేదు కదా. పడుకొన్నానే కాని నాకు నిద్ర పట్టటంలేదు. ప్రభాకర్ సమస్యే నాకంటికి భూతంలా కనిపించసాగింది. అసలు నా ఇంటిలో

వాడు నడవడం ఆపి విరగబడి నవ్వాడు. ఆ అర్ధరాత్రి వాడలా నవ్వుతుంటే నాకెందుకో ఒక సభ్యుడు కావడం చాలా విచిత్రంగా జరిగింది.

ఆరోజు కాలేజీకి ఎదురుగ రోడ్డు పక్కనున్న కానుగచెట్టు కింద నిలబడున్నాడొక వ్యక్తి. గుడ్డలు మాసి ఉన్నాయి. గడ్డం పెరిగి ఉంది. తైల సంస్కారం లేని జుట్టు. భుజానికి జోలెలాగ ఒక సంచి తగిలించుకొన్నాడు. శూన్యంలోకి చూస్తూ ఉన్నాయి అతని చూపులు. ఎవరూ అతన్ని పట్టించుకోవడంలేదు. నేను మామూలుగా స్టాపురూంలోకి వెళ్లి కూర్చున్నాను. కిటికీలోంచి ఆ వ్యక్తి కనిపిస్తున్నాడు.

ఆశ్చర్యం....

అరగంట తరువాత ప్రిన్సిపాల్ అతన్ని సాఫ్‌రూంకు తీసుకువచ్చి మా అందరికి పరిచయం చేశాడు. "హిఈజ్ మిష్టర్ ప్రభాకర్, ఎకనమిక్స్ లెక్చరర్, బి.ఎ.లో యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్టు. అయామ్ ప్రౌడ్ ఆఫ్ హిమ్" గౌరవపూర్వకంగా చెప్పి వెళ్లిపోయాడు.

ప్రభాకర్ గదిలో ఓ మూలకు వెళ్లి ఎవరూ లేనిచోట కూర్చున్నాడు. అతడు బాగా తాగున్నాడు. ఎవరు ఏదడిగినా సమాధానం చెప్పకుండా కూర్చున్నాడు. నేను టైం కాగానే వెళ్లి క్లాసైన తరువాత వచ్చాను.

అతన్నిచూసి పరిచయపూర్వకమైన నవ్వునవ్వాను. అతను కూడా చిన్నగా నవ్వి, "ఒరేయ్, నీపేరు రాజశేఖర్ కదూ" అన్నాడు.

"మీరు... మీరు... నేను మీకు తెలుసా" అన్నాను ఆశ్చర్యంగా.

"ఒరేయ్ జస్ట్ అయిదేళ్ల నాటి గతం నీవింత తేలికగా మరచిపోయినా, నేను మరచిపోలేనురా. బి.ఏ.లో నీరూమ్మేట్ ప్రభాకర్‌ని మరచిపోయావట్రా."

"ఓరేయ్" పెద్దగా అరిచాను.

"...అయామ్ సారీరా. ఏమనుకోకు. డిగ్రీ కాగానే చెరో యూనివర్సిటీ పరమయ్యాం. నిన్ను ఈ వేషంలో గుర్తుపట్టడానికి చాలా కష్టమయింది. నన్ను క్షమించు."

"ఇందులో నీ తప్పు లేదురా. ఈ వేషంలో ఉన్న నన్ను మాతల్లిదండ్రులు కూడా గుర్తుపట్టలేరు"

"అంటే..."

"ఇంటికి వెళ్లి మూడేళ్లయింది"

"కారణం..."

"కారణాలు అనేకం. అంటి దగ్గర మాట్లాడుకుందాం. ఇంతకీ బ్రహ్మచారివా, సంసారివా?" అన్నాడు నవ్వుతూ.

"పెళ్లయి రెండేళ్లయిందిరా. సుధ ఇక్కడే బ్యాంకులో పనిచేస్తోంది."

"సుఖీభవ" అంటూ వాడు వేదాంత ధోరణిలో ఆశీర్వదించాడు.

వాడు క్లాసుకెళ్లి వచ్చాడు. అంతే... స్టూడెంట్సు గుంపులు గుంపులుగా వాడి వెనుకనే రాసాగారు. ఏదో గొడవ జరిగి ఉంటుందను కొన్నాను. కాని అది గొడవ కాదు. ఒకే ఒక క్లాసుతో విద్యార్థుల్ని తన వాక్చాతుర్యంతో, తన విజ్ఞానంతో, వాళ్లను తనవైపు ఆకర్షించుకొన్నాడు. అలాంటి పేరు ఏ లెక్చరర్ ఇప్పటి వరకూ తెచ్చుకోలేదేమో. అదే గొప్ప అవార్డు.

నేను ప్రభాకర్ని నాతోపాటు ఇంటికి బయలుదేరతీశాను. దారిలో వాడు ఒక బ్రాందిషాపు వద్ద ఆగి బ్రాంది బాటిల్ కొని సంచిలో వేసుకున్నాడు. నేను వారిస్తున్నా వినలేదు.

మేమింటికి వెళ్లేసరికి సుధ ఇంటికి వచ్చి ఉంది. నేను మా ఇద్దరి అనుబంధాన్ని విడమరచి చెప్పాను. సుధ ఎంతో ఆనందించింది.

"అన్నయ్యగారూ మీరొక్కరే కదా. మా ఇంట్లోనే ఉండండి" అంది ఆప్యాయంగా నేననాలనుకొన్నది సుధ నోట్లోంచి రావడం నాకెంతో ఆనందమనిపించింది.

దానికి ప్రభాకర్ కూడా ఆనందిస్తూ, "నేను మీరు వెళ్లమన్నా ఇక ఇంట్లోంచి వెళ్లను. ఇక్కడే శాశ్వతంగా ఉండిపోతాను" అన్నాడు.

ఆరోజు రాత్రి నన్ను, సుధను కూర్చోబెట్టి తన విషయం యావత్తూ చెప్పుకొచ్చాడు. తను డిగ్రీ చదివేటప్పుడు తన ఊళ్లోనే తనతో ఇంటర్ వరకూ చదివి ఇంటివద్దనే ఉంటున్న సామ్రాజ్యంను ప్రేమించాడు. సామ్రాజ్యం కూడా అంతే. కాని కంసుడిలా ఆమె మేనమామ అడ్డొచ్చి తన ప్రేమను ఎగరేసుకుబోయాడట. తన తమ్ముడ్ని చేసుకొనకపోతే తను ఉరేసుకొని చనిపోవడం ఖాయమని తల్లి చెప్పడంతో పాటు ఉరివేసుకోవడానికి ప్రయత్నించగా చివరకు ఒప్పుకొంది సామ్రాజ్యం.

సామ్రాజ్యం హృదయ సామ్రాజ్యం పోకొట్టుకొన్న ప్రభాకర్ రాజ్యభ్రష్టుడైన రాజులా తిరుగుతున్నాడు. ఇదీ ప్రభాకర్ చరిత్ర.

• • • • • • • • •

దాదాపు నెల గడిచింది. ప్రభాకర్ పరిస్థితి మామూలే. అతన్ని వాచ్ చేయడం మా దినచర్యలో ఒక భాగమైంది. వాడు మా కుటుంబసభ్యుల్లో ఒకడైపోయాడు. సుధ తల్లికంటే ఎక్కువగా అతనికి సేవచేస్తూ ఉంది. ఆరోజు మధ్యాహ్నం నుండి నాకు క్లాసులు లేకపోవడంతో పెందలాడే ఇంటికి వచ్చాను. సాయంత్రం ఆరుగంటలకు సుధ కూడా వచ్చేసింది.

ఇద్దరం వరండాలో కుర్చీలు వేసుకొని కూర్చొని మాట్లాడుకొంటున్నాం. రాత్రి ఎనిమిదవుతుండగా వీధిగేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టాడు ప్రభాకర్. భుజానికి

మామూలుగా వ్రేలాడుతూ సంచి, కొత్తగా చేతిలో ఏదో పెద్దపాకెట్ పట్టుకుని ఉన్నాడు. మనిషి బాగా తాగి ఉండడంతో తూలుతూ నడుస్తున్నాడు.

మాకెదురుగా వచ్చి నిలబడి. "మీరిద్దరూ లేచి నిలబడండి. పక్కపక్కనే" అన్నాడు.

మాకేమీ అర్థం కాక అతను చెప్పినట్లే లేచి నిలబడ్డాం.

చప్పున వాడు మా ఇద్దరి పాదాల మీద పడ్డాడు. ఇది మేమూహించనిది. సుధ నిర్విణ్ణురాలైంది.

"అన్నయ్యా, ఏమిటిది?" అంది వెనుకకు అడుగులేస్తూ.

ప్రభాకర్ నిలబడి. "మీరిద్దరూ నా తల్లిదండులు. నామొదటి జీతపు కానుక" అంటూ సుధకు ఒక పాకెట్ అందించాడు. సుధ పాకెట్ ఊడదీసింది. అందులో రెండువేల రూపాయల ఖరీదైన చీర, మూడువేల రూపాయలు విలువ చేసే సూట్ ఉంది.

"అన్నయ్యా, ఈ పద్ధతేం బాగాలేదు" అంది సుధ కోపంగా.

"ఎందుకు బాగా లేదమ్మా? ఈ ఇల్లే నా దేవాలయం. మీరిద్దరూ అందులో దేవతలు." అన్నాడు.

"ఒరేయ్ ఏ ప్రతిఫలం ఆశించకుండా నిన్ను మా ఇంట్లో ఉంచుకున్నాం. అలాంటిది ఈ పిచ్చిపనులకు నేనొప్పుకోనురా."

ప్రభాకర్ ముఖవళికలు మారిపోయాయి. సుధ కంగారు పడింది.

"సరే లోపలికి పదండి అన్నయ్యగారూ భోంచేస్తురుగాని" సంభాషణ మారుస్తూ అంది.

"ఆల్‌రైట్" అంటూ ఆనందంగా లోపలికి వచ్చాడు.

రోజులు గడచిపోతున్నాయి. ప్రభాకర్ మాలో ఒకడైపోయాడు. వాడ్ని కాపాడడం మా బాధ్యత అయికూర్చుంది. కాని వాడివల్ల మాకెప్పుడూ బాధ కలగలేదు.

ఒక రోజు ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. నేను ఆ అర్థరాత్రి బాత్‌రూంకు వెళ్లడానికి లేచాను. అప్పుడు టైం అయిదు గంటలు. బాత్‌రూం నుంచి హాల్లోకి వచ్చి బయట లైటు వెలుగుతుండటంతో కిటికీలోంచి చూశాను. వరండాలో కడుపు పట్టుకొని పొర్లుతున్నాడు ప్రభాకర్. పరుగెత్తుకు వెళ్లి సుధను లేపాను. ఇద్దరం బయటికొచ్చాం. నేను వాడ్ని పట్టుకున్నాను. వాడికి చాలా రోజుల్నుంచి కడుపునొప్పి వ్యాధి ఉంది. అది వచ్చినప్పుడు ఏదో టాబ్లెట్ మింగుతాడు. కొద్దిగా ఉపశమిస్తుంది.ప్రస్తుతం గదిలో అవి అయిపోయి ఉంటాయనుకొన్నాను.

బాధతో మెలికలు తిరుగుతున్న వాడిని ఓదార్చుతూ కొద్దిగా సాల్ట్ కలిపిన నీళ్లు త్రాగించాను.

"ఏరా ఏమైంది?" అని అడిగాను.

"ఇంత బాధపడకపోతే మమ్మల్ని పిలవకూడదా అన్నయ్యా" అంది సుధ కన్నీళ్లతో. ప్రభాకర్ ఏం మాట్లాడకుండా ఉండిపోయాడు.

"దీనికి శాశ్వత పరిష్కారంగా డాక్టర్ని కలవొచ్చుగా" అన్నాను.

"హూ...డాక్టర్నా. డాక్టర్ని కలిస్తే తాగుడు మానేయమంటాడు."

"మానెయ్యి" అన్నాను.

"ఒరే. సామ్రాజ్యాన్ని మరచిపోవడానికి తాగుతున్నాను. అలా త్రాగలేనప్పుడు సామ్రాజ్యం స్మృతులు నన్ను బ్రతకనీయవురా"

"సరేలే ఏడ్చావు. ఎప్పుడూ ఉండేదేగా" అంటూ వాడ్నిమందలించాను.

ఇంతలో సూర్యోదయమైంది. తర్వాత చెప్పాడు మా ఆనందాన్ని చెడగొట్టలేక లేపలేదట.

రోజులు గడుస్తున్నాయి. వాడు మాకు పర్మినెంట్ గెస్టైపోయాడు. త్రాగుతూనే ఉన్నాడు. రోజుకు పదిసార్లైనా తన ప్రియురాలు సామ్రాజ్యం గురించి చెప్పడం మానలేదు.

ఒకరోజు చాలా ఆనందంగా కనిపించాడు. "ఒరేయ్, నా సామ్రాజ్యం ఇప్పుడు గర్భవతి. మా ఒప్పందం ప్రకారం మొదటి బిడ్డను నాకిస్తానన్నారు. కొన్ని నెలల్లో నాకు ఒకతోడు రాబోతున్నాడురా. నాదంటూ ఒక ప్రాణి" అన్నాడు.

వాడి పిచ్చికి నవ్వుకున్నాను. సామ్రాజ్యం వీడితో ఓదార్పు కొరకు అలాని ఉండవచ్చు. వీడు దాన్ని నిజమే అనుకొంటున్నాడు. కాని ఆమెభర్త, అత్తమామలు ఒప్పుకోరుగా.

కాలం గడుస్తూఉంది. ఉన్నట్లుండి ఒకరోజు హఠాత్తుగా మాయమైపోయాడు ప్రభాకర్. ఎక్కడ విచారించినా అతని ఆచూకీ తెలియలేదు.

ఎంత హఠాత్తుగా మాయమయ్యాడో, అంత హఠాత్తుగా నెల తరువాత ప్రత్యక్షమయ్యాడు.

"రేయ్! సామ్రాజ్యం చచ్చిపోయిందిరా. చచ్చిపోయిన వారానికి నాకు తెలిసిందిరా. సామ్రాజ్యాన్ని చంపేశారురా. సామ్రాజ్యంతో బాటు నాకిస్తానన్న బిడ్డనుకూడా చంపేశారురా" అంటూ నన్నుపట్టుకొని భోరున ఏడ్చాడు.

అతన్ని ఓదార్చడం ఎంతో కష్టమైపోయింది.

"ఏదైతేనేం సామ్రాజ్యం భర్తని లోపల వేయించాను," తృప్తిగా అన్నాడు చాలాసేపటికి.

ఆ రాత్రంత వాడు తనగదిలో తనకిష్టమైన పాట 'పయనించే ఓ చిలుకా పాడైపోయెను గూడు' అనే పాటనుటేప్ రికార్డరులో పదేపదే వింటూనే ఉన్నాడు. ఉదయం నిద్రలేచి వాడి రూంవైపు నడిచాను. వాడిరూం తలుపులు బార్లా తెరిచివున్నాయి. వాడి లెదరు బ్యాగ్,

ఎప్పుడూ టేబుల్ మీదుండే వాడి ప్రియురాలి ఫోటో కనిపించలేదు. నేను వెంటనే సుధను పిలిచాను. గదంతా వెతికినా ఏమీ దొరకలేదు.

ఇంతలో టేప్‌రికార్డును ఆన్ చేశాను. ప్రభాకర్ మాటలు వినిపించాయి.

"ఒరేయ్ శేఖర్! అమ్మా సుధా!

నా ప్రాణమైన సామ్రాజ్యం, నాబిడ్డ నాకు దక్కకుండా పోయిన తరువాత నాకు ఇంకెవరున్నారు.

నిస్తేజమైన ఈ జీవితంలో నాకింకేం మిగులుందని.

నాకు నా సామ్రాజ్యం చనిపోయిందని తెలియగానే ఇది సహజమైన చావు కాదని నాకెందుకో అనిపించింది. వాళ్ల ఊరికి వెళ్లాను. అందరూ నన్ను వింతగా చూశారు. చుట్టూ వివరాలు సేకరించాను. నా అనుమానం నిజమే అయింది. అత్తమామలు, భర్త చాలాకాలంగా హింసించడం నిజమేనని చెప్పారు. ఆ హింసల మూలంగానే మరణించిందని చెప్పారు. వెంటనే రిపోర్టు ఇచ్చాను. అంతా రంగంలోకి దిగారు.

మరుసటిరోజు మధ్యాహ్నం ఒంటిగంట వేళ స్మశానంలో....

ఎండ ప్రచండంగా కాస్తోంది.

ఎక్కడా నీడలేదు.

సమాధులు తలలెత్తి ఆకాశం వేపు చూస్తున్నాయి.

సమాధుల్ని అనుకునే ఒక చిన్ననది ప్రవహిస్తూ ఉంది.

ఆ నది ఒడ్డునే మట్టిలో పూడ్చారట సామ్రాజ్యాన్ని.

నా ప్రాణం సమాధి అయిన ప్రదేశమిది.

నిశ్శబ్దంగా ఈ బాధలకు అతీతంగా అందులో నిద్రిస్తూ ఉంది నా సామ్రాజ్యం.

ప్రభుత్వాధికారులు భూస్తాపితమైన నా సామ్రాజ్యాన్ని బయటకు తీస్తుంటే ఓర్చుకోలేక పోయాను. చెట్టూ పుట్టలేని ఆ భీభత్సకరమైన ప్రదేశంలో నాలాగా ఒంటరిగా పొడవైనా ఒకేఒక తాడిచెట్టు నిలబడి ఉంది. దానికి మూడే మూడు ఆకులున్నాయి. అది నీడకు పనికిరాకపోగా నాలాంటి బాధోపహతులు తలకొట్టుకొని ఏడ్చుకొనేదానికి పనికివస్తుంది. నేనా చెట్టుకు అనుకొని నిలబడి సంచిలోంచి బాటిల్ తీసి త్రాగసాగాను బాధ మరచిపోవడానికి.

శవాన్ని బయటికి తీసి, కొన్ని భాగాల్ని పరీక్షకు తీసుకోవడం కోసం శరీరాన్ని కత్తితో కోస్తున్నారు. ఆ సమయంలో నా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకో. నాశరీరాన్ని కోసినంత బాధపడ్డాను. ఆ దృశ్యాన్ని చూడలేక అక్కడ నుండి వచ్చేసాను.

మిత్రమా శేఖర్!

ఆధారాలతో సహా సామ్రాజ్యాన్ని చంపిన ఆమె భర్తను హంతకుడిగా నిరూపించాను. అతనికి ఆజన్మఖైదు తప్పదు. దీన్ని ఎవరూ తప్పించలేరు కూడా. కేసు అంత గట్టిగా బిగించబడింది. నాకింక జీవితంలో ఏ ఆశాలేదు. నాకిక ఎవరూ లేరు.

అమ్మా సుధా!

ఈ జీవన గమనంలో నేను గమ్యంలేని విహంగాన్ని. ఎక్కడ నా జీవితం ఎలా అంతమవుతుందో నాకే తెలియదు. ఆత్మకు చావులేదు. ఈ శరీరాన్ని విసర్జించి కొత్త శరీరంతో మీ దంపతులకు కొడుకుగా పుట్టి మీ ఋణం తీర్చుకొంటాను.

ఇది నా ఒకే ఒక కోరిక. వెళ్తున్నాను.

ఈ జన్మకిక సెలవు.

మీ

ప్రభాకర్.

సుధ నాచేతుల్లో కూలిపోయింది. నా కన్నీటికి అంతులేదు ✸

**(ఆంధ్రప్రభ వీక్లీ, తేది 23-2-2002)**